
వైసీపీకి ఎదురుదెబ్బ
జడ్పీటీసీల సమావేశానికి
సగం మంది గైర్హాజరు - 7లో

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





లడ్డూ అపవిత్రం గళమెత్తిన జనం

తిరుమల లడ్డూ అపవిత్రంపై నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే నాయకర్, మాజీ మంత్రి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌చార్జ్ రామరాజు, కొవ్వలి నాయుడు తదితరులు



శ్రీవారి ఆలయంలో లఘు సంప్రోక్షణ

హిందూ మనోభావాలను మంటకలిపే విధంగా జగన్ తీసుకున్న నిర్ణయాలతో ఏర్పడిన సంక్షోభ నివృత్తి కోసం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో లఘు సంప్రోక్షణ, మహాశాంతి హోమం



కుండపోతగా వాన

కాళ్ల సినిమా హాల్ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కాళ్ళ, సెప్టెంబరు 23 : మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమై కాలువలను తలపిస్తున్నాయి. మోకాలి లోతు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాళ్ళ సినిమా హాల్ సెంటర్ శివాలయంలో వద్ద రాష్ట్రీయ రహదారి చెరువులను తలపించింది. అసలే అధ్వాన్నంగా ఉన్న కోలనపల్లి - ఆకివీడు రహదారి వర్షంతో మరింత అస్తవ్యస్తమైంది. దీంతో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చనిపోయిన వారికి మస్తర్లు !

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 23 : చనిపోయిన వారికి మస్తర్లు వేసి ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడిందని చినతాడేపల్లి సోషల్ ఆడిట్ గ్రామ సభలో ఎస్ఆర్‌పీ ఎం.గోవిందు వెల్లడించారు. చినతాడేపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ పిచ్చిల రాజారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన గ్రామ సభలో పనులపై చర్చించారు. ఈ సందర్భంగా పనికి వెళ్లని 26 మందికి ఫీల్డ్ అసిస్టెంట్ మస్తర్లు వేసి 2.50 లక్షలు స్వాహా చేశారని గ్రామస్థులు ఆరోపించారు. వీరితో పాటు చిటకని చంద్రయ్య, జక్కంశెట్టి రాంబాబు, లాయి మునియ్య, మారిశెట్టి శ్రీలక్ష్మి చనిపోయి నాలుగేళ్లయినా ఇంకా మస్తర్ వేస్తున్నారని ఆరోపించారు. వాటిపై సమగ్ర దర్యాప్తు చేసి అవినీతికి పాల్పడిన వారిని శిక్షించాలని కోరారు. గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన చోడే సరస్వతి మాట్లాడుతూ 2016 నుంచి 19 వరకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేసిన తనను వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి తప్పు చేయకపోయినా తనను తొలగించారని, కోర్టు తీసుకోవాలని చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటి ఫీల్డ్ అసిస్టెంట్ ఇందిర ప్రతీ సోషల్ ఆడిట్‌లో చనిపోయిన వారి పేర్లతో మస్తర్లు వేసినా వైసీపీ నాయకులు అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సీఆర్‌పీ నరేష్, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

ఏలూరు కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుల నామినేషన్లు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 23 : నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులుగా చోడే వెంకటరత్నం, కొల్లేపల్లి రాజు, జాలా సుమతి నామినేషన్లు దాఖలు చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఈ పత్రాలను అడిషనల్ కమిషనర్ జి.చంద్రయ్యకు అందజేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

మీ కోసం అర్జీలు 271 :

వీటిని పరిష్కరించాలి : కలెక్టర్ నాగరాణి

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 : సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధేశించిన సమయంలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, జిల్లా అధికారులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఒకసారి వచ్చిన ఫిర్యాదు మళ్లీ రాకుండా అధికారులు అత్యంత బాధ్యతతో చక్కని పరిష్కారం చూపాలని కలెక్టర్ చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 271 అర్జీలు వచ్చాయి.

- భూమిని కౌలుకిచ్చి పంట నమోదు చేయించుకున్న భూస్వాములు, భూయజమానుల పేరు వద్ద ఎడిట్ ఆప్షన్ ఇచ్చి కౌలు రైతుల పేరు నమోదు చేసి పంట నష్టం అందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు సోమవారం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు ఎడిట్ ఆప్షన్ ఇచ్చి, భూయజమానులు పంట నమోదు చేయించుకున్న చోట కౌలు రైతుల పేరు నమోదు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

నాణ్యతతో పనులు చేయాలి

- జిల్లాలో చేపడుతున్న ఇరిగేషన్, డ్రైనేజీ పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించిన కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఇరిగేషన్‌లో 45 పనులకు రూ.4.81 కోట్లు, డ్రెయిన్లలో 35 పనులకు రూ.5.92 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. వీటితో చేపట్టిన పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. రైతులకు సాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా కర్ర నాచు, గుర్రపు డెక్క, తూడు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. జలవనరులశాఖ ఈఈ దక్షిణామూర్తి, డ్రైనేజీ శాఖ ఈఈ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రత

- పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ నాగరాణి పిలుపునిచ్చారు. సోమవారం భీమవరం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో ఒమిక్స్ నెక్స్ జెన్ లేబొరేటరీస్, రాఘవ రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరీక్షల మెడికల్ క్యాంప్‌ను సందర్శించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ రూ.3.20 లక్షల విలువైన రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఒమిక్స్ నెక్స్ జెన్ లేబరేటరీస్ అధినేత సిహెచ్ కృష్ణంరాజు, రాఘవరాజు, చారిటబుల్ ట్రస్టు సభ్యులు అల్లూరి వంశీకృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటు.. ఇటు

కొలిక్కి వచ్చిన ఉద్యోగుల బదిలీల ప్రక్రియ.. నిషేధం అమల్లోకి



భీమవరం/టౌన్, ఏలూరు సిటీ(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఎక్సైజ్ శాఖ మినహా మిగిలి శాఖల ఉద్యోగుల బదిలీల ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. జిల్లా అధికారుల నుంచి గ్రామ పంచాయతీ సిబ్బంది వరకు ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారికి స్థాన చలనం కల్పించారు. తాము కోరుకున్న చోటుకు బదిలీపై వెళ్లిన వారిలో సంతృప్తి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యేల సిఫారసులు తీసుకున్నా కొందరికి చుక్కెదురైంది. తాము అనుకున్న చోటుకు బదిలీ కాలేకపోయారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, ఆర్టీసీ, దేవదాయ, మున్సిపల్ శాఖల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, తహశీల్దార్‌లు, ఎంపీడీవోలు, సబ్ రిజిస్ట్రార్‌లకు బదిలీలు అధికంగా జరిగాయి. రిజిస్ట్రేషన్ శాఖలో గడువు పొడిగించి పూర్తి చేశారు. సోమవారం నుంచే మళ్లీ నిషేధం అమలులోకి వచ్చింది. వ్యవసాయ శాఖలో బదిలీలను ప్రభుత్వం వాయిదా వేసింది. బదిలీల నుంచి మినహాయింపునిచ్చింది. వరదలు, వానలతో వ్యవసాయ శాఖలో బదిలీలు జరగలేదు. ఇవి డిసెంబరులో ఉంటాయని ఆశిస్తున్నారు.

మునిసిపల్ శాఖలో

రెండు రోజుల క్రితం మున్సిపాలిటీలలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌ల ఉత్తర్వులు, సోమవారం టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాడేపల్లిగూడెంలో మున్సిపల్ ఇంజనీర్, ఇన్‌చార్జ్ కమిషనర్ మురళీకృష్ణను విశాఖపట్నం ఈఈగా నియమించారు. ఆయన స్థానంలో మున్సిపల్ ఇంజనీర్‌గా ఏలూరు పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణను నియమించారు. భీమవరం టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీని విశాఖపట్నం జీఎంసీకి బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న ఎం.శ్రీలక్ష్మిని భీమవరం బదిలీ చేశారు. సీపీవోగా పి.పార్థసారధిని భీమవరం బదిలీ చేసారు. మెప్మా సీఎంఎంగా పనిచేస్తున్న నానిబాబును బదిలీ చేయగా ఆయన స్థానంలో కే.సుధాకర్‌రావు వచ్చారు. రెండు రోజుల క్రితం తెనాలి నుంచి భీమవరం మున్సిపాలిటికి మేనేజర్‌గా వచ్చిన కె.అప్పలరాజును నెల్లిమర్ల కమిషనర్‌గా నియమించారు.

దేవదాయ శాఖలో..

దేవదాయ ధర్మదాయ శాఖలో పంచారామక్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి దేవస్థానంలో ఇన్‌చార్జిగా పనిచేస్తున్న డి.రామకృష్ణంరాజును రెగ్యులర్ ఈవోగా నియమించారు. భీమశ్వరస్వామి దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావును పాలకొల్లు క్షీరరామలింగేశ్వరస్వామి ఆలయ ఈవోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మత్స్యపురి గ్రూపు దేవస్థానం ఈవో తోట శ్రీనివాసరావును నియమించారు. దొడ్డిపట్ల గ్రూపు దేవాలయం ఈవో ఎం.రఘునాధ్‌ను మత్స్యపురి గ్రూపు దేవాలయ ఈవోగా నియమించారు. భీమవరం దంతులూరి జగన్నాదరాజు సత్రం ఈవోగా కోనసీమలోని కడలి గ్రూపు దేవాలయాల ఈవోగా పనిచేస్తున్న ఎం.సత్యనారాయణరాజును నియమించారు. ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవిని సింగరాజుపాలెం వల్లీసుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయ ఏసీగా నియమించారు. శ్రీరామపురం రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఈవో దండు కృష్ణంరాజును పండిత విల్లూరు దేవస్థాన ఈవోగాను, అక్కడ పనిచేస్తున్న బ్రహ్మారెడ్డిని ఇక్కడ ఈవోగాను నియమించారు. యనమదుర్రు శక్తీశ్వరస్వామి ఆలయ ఈవో కె.శ్రీనివాస్‌ను కొణితివాడ దేవస్థాన ఈవోగా బదిలీ చేశారు. తాళ్ళపూడి వేంకటేశ్వస్వామి దేవస్థానం ఈవో ఎం.అరుణకుమార్‌ను మొగల్తూరు గంటి ముత్యాలమ్మ దేవాలయానికి బదిలీ చేశారు. సోమేశ్వరస్వామి ఆలయం ఈవో సురేష్ నాయుడును పట్టిసీమ గ్రూపు దేవాలయ ఈవోగా బదిలీ చేశారు. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయ ఈవో ఆకుల కొండలరావు కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరంలోని కొండాలమ్మ దేవస్థాన ఈవోగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కాకినాడ ఎంఎస్ఎం చారిటీస్ నుంచి ఆర్వీ చందన అసిస్టెంట్ కమిషనర్ హోదాలో ఈవోగా నియమితులయ్యారు.

ఇతర శాఖల్లో

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో 429 మంది ఉద్యోగులకు బదిలీల ప్రక్రియ పూర్తి చేసి ఉద్యోగులకు ఉత్తర్వులు కాపీలను అందజేశారు. ఇందులో అడ్మినిస్ట్రేటివ్ అధికా రులు 42 మంది, సీనియర్ అసిస్టెంట్స్ 78 మంది, జూనియర్ అసిస్టెంట్లు 118 మంది, టైపిస్టులు 15 మంది, ల్యాబ్/లైబ్రరీ అసిస్టెంట్లు 53 మంది, రికార్డు అసిస్టెంట్లు 79 మంది, ఆఫీసు సబార్డినేట్స్ 20 మందిని బదిలీ చేశారు.
- విజయవాడ డీటీసీ కార్యాలయంలో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సత్యఫణి తేజను పశ్చిమ గోదావరి జిల్లా ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి బదిలీ చేశారు.
- ఆర్టీసీ ఏలూరు జిల్లా ప్రజారవాణాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్‌ను పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా రవాణాధికారిగా బదిలీ చేశారు. తిరిగి ఆయనను ఏలూరు జిల్లా ప్రజా రవాణాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆయన రెండు జిల్లాల బాధ్యతలను నిర్వర్తించనున్నారు.



మాట్లాడుతున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి

మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 23 : 'మహిళల భద్రతకు ప్రతీ సంస్థలోను సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. అనుమానంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తే ఆకతాయిలు, పోకిరీలు రాత్రి వేళల్లో తిరగకుండా ఉంటారు. 1993 నుంచి లక్షా 68 వేల కంపెనీలలో స్త్రీలపై లైంగిక వేధింపులు జరిగినట్లు కేసులు నమోదయ్యాయి. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించి, వారి భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి' అని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి సాయిని అన్నారు. ఏపీ నిట్‌లో స్పందన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం 'పని, బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రత' అనే అంశంపై నిర్వహించిన చర్చలో ఆమె మాట్లాడారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ కళాశాల, సంస్థల్లో కౌన్సెలింగ్ ఇచ్చే ప్రొఫెసర్లను నియమించాలన్నారు. నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి, స్పందన ఫౌండేషన్ భోగిరెడ్డి ఆదిలక్ష్మి, హార్టికల్చర్ యూనివర్సిటీ సైంటిస్ట్ కరుణశ్రీ మాట్లాడారు. డీవైఈవో బాపయ్య శర్మ, అడ్వకేట్ శ్యాంప్రసాద్, ప్రిన్సిపాల్ లక్ష్మీసరోజ, డాక్టర్ చిట్యాల సురేంద్ర, నిట్ ఆచార్యులు కార్తీక్‌శర్మ, ఇన్‌చార్జి ఆర్డీవో, శివనారాయణరెడ్డి, స్త్రీ సంక్షేమ శాఖ అధికారి బీ.సుజాతరాణి తదితరులు పాల్గొన్నారు.

తాను చనిపోతూ.. కొందరికి ఊపిరి



- రోడ్ ప్రమాదంలో కుమారుడి బ్రెయిన్‌డెడ్.. అవయవ దానానికి తల్లిదండ్రుల అంగీకారం.. నేడు స్వగ్రామంలో రేవంత్ అంత్యక్రియలు

కాకినాడ, సెప్టెంబరు 23 : తాను చనిపోతూ తన అవయవాలతో కొందరికి ఊపిరి పోశాడో విద్యార్థి. పుట్టెడు దుఃఖంలో సైతం కుమారుడి అవయవదానానికి అంగీకరించి.. తల్లిదండ్రులు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. వీరవాసరం మండలం తోకలపూడికి చెందిన పోలిశెట్టి రేవంత్ శ్రీమురహరి(19), మరో యువకుడితో కలిసి విశాఖపట్నంలో పరీక్ష రాయడానికి వెళుతూ కాకినాడ జిల్లా తుని మండలం యర్రవరం వద్ద ఈ నెల 21న ప్రమాదంలో గాయపడ్డారు. వారిని కాకినాడ అపోలో ఆస్పత్రికి తరలించారు. డిపార్ట్‌మెంట్ చీఫ్ డాక్టర్ ఎంవీ కిరణ్‌కుమార్, న్యూరాలజిస్టు డాక్టర్ శివరామగాంధీ వైద్య చికిత్స అందించినప్పటికి బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. అనంతరం తల్లిదండ్రులు నాగపుష్ప, సుబ్రహ్మణ్యానికి అవయవదానంపై అవగాహన కల్పించడంతో ఇందుకు సమ్మతించారు. వెంటనే కిడ్నీలు, లివర్ దానం కోసం జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేయడంతో ఒక కిడ్నీని కాకినాడ అపోలో ఆస్పత్రికి, మరో కిడ్నీని విశాఖపట్నం కేర్ ఆస్పత్రికి, లివర్‌ను షీలానగర్ కిమ్స్ ఆస్పత్రికి కేటాయించారు. కాకినాడ అపోలో హాస్పిటల్స్‌లో ఆర్గాన్ హార్వెస్టింగ్ చేయడానికి నిర్ణయించారు. ఇక్కడి నుంచి అవయవాలు తరలించేందుకు కాకినాడ జిల్లా ఎస్పీ సహకారం తీసుకున్నారు. కళ్లను బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం ఇచ్చారు. సోమవారం అవయవదానం ప్రక్రియ పూర్తికావడంతో మంగళవారం రేవంత్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నాడు కోటిపల్లి.. నేడు మచిలీపట్నం

- రెండు కొత్త లైన్లకు కూటమి ప్రభుత్వంలోనే మోక్షం
- పెద్ద జంక్షన్‌గా మారనున్న నరసాపురం స్టేషన్

నరసాపురం, సెప్టెంబరు 23 : కోటిపల్లి-నరసాపురం-మచిలీపట్నం రైల్వేలైన్ ప్రతిపాదన బ్రిటీష్ ప్రభుత్వ కాలం నాటిది. కాని, నరసాపురం - విజయవాడ మధ్య లైన్ ఏర్పడిందే తప్ప కోటిపల్లి-నరసాపురం-మచిలీపట్నం మార్గాలకు మోక్షం లభించలేదు. 2001లో కోటిపల్లి రైల్వే లైన్‌కు పచ్చజెండా ఊపినప్పటికీ నిధులు విడుదల చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కింది. తొలిసారి 2015లో ఈ ప్రాజెక్టుకు రూ. 300 కోట్లు కేటాయించింది. తాజాగా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మచిలీపట్నం రైల్వేలైన్‌ను ఈ బడ్జెట్‌లో తెరమీదకు తీసుకొచ్చింది. రెండు నెలల వ్యవధిలో సర్వే పూర్తి చేయించి కొత్త లైన్‌కు సానుకూలత తీసుకొచ్చింది. ఈ పనులు ప్రారంభానికి నోచుకుంటే ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లా మధ్య 120 కిలోమీటర్ల మేర కొత్త రైల్వేలైన్ ఏర్పడనుంది.

కోటిపల్లి రైల్వేలైన్

బ్రిటిష్ కాలంలోనే ఈ ప్రతిపాదన ఉన్నప్పటికీ గోదావరిపై భారీ వంతెనలు నిర్మించాల్సి రావడంతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. 2001లో దీనికి పచ్చ జెండా ఊపారు. నిధులు మాత్రం 2015 వరకు కేటాయించలేదు. 2014 ఎన్నికల్లో భీమవరం బహిరంగ సభలో ప్రధాని మోదీ కూటమిని గెలిపిస్తే.. కోటిపల్లిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే 2015 బడ్జెట్‌లో ఈ లైన్‌కు రూ.300 కోట్లు విడుదల చేయించి పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు రూ.1,200 కోట్లను రైల్వే ఖర్చు చేసింది. 51 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ కొత్తలైన్ వల్ల కోనసీమకు రైల్వేకూత వినిపించనుంది. విశాఖ, రాజమండ్రి మధ్య మెయిన్‌లైన్‌లో ట్రాఫిక్ తగ్గనుంది. ప్రస్తుతం ఈ లైన్‌లో రద్దీ ఎక్కువగా ఉన్నందున్న కొత్త రైళ్లను పట్టాలెక్కించేందుకు వీలు పడటం లేదు. కోటిపల్లి లైన్ పూర్తయితే సామర్లకోట-కోటిపల్లి-నరసాపురం మీదుగా విజయవాడకు కొత్త మార్గం ఏర్పడనుంది. వీటిని అధ్యయనం చేసి రైల్వే ఈ ప్రాజెక్టును మొదలుపెట్టింది. ప్రస్తుతం 60 శాతం పనులు పూర్తయ్యాయి. రెండేళ్లలో ఈ కొత్తలైన్ పనులను పూర్తి చేయాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లైన్‌లో రైళ్లు పట్టాలు ఎక్కితే జిల్లాలో నరసాపురం పెద్ద జంక్షన్‌గా మారనుంది. విశాఖ నుంచి ఒడిశా, కోల్‌కతా, అస్సోం ఇతర ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే చాలా రైళ్లను కోటిపల్లి మీదుగా విజయవాడకు మళ్లించనున్నారు.

శివారు స్టేషన్ మచిలీపట్నం


విజయవాడ డివిజన్‌లో శివారునున్న స్టేషన్లలో మచిలీపట్నం ఒకటి, దూరప్రాంతాలకు చాలా రైళ్లను ఈ స్టేషన్ నుంచి నడుపుతున్నారు. ప్రస్తుతం పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ఈ రైల్వేస్టేషన్‌ను జంక్షన్ చేసేందుకు కసరత్తు మొదలుపెట్టింది. దశాబ్దాలుగా పెండింగ్‌లోవున్న నరసాపురం, మచిలీపట్నం రైల్వేలైన్‌ను తెర మీదకు తీసుకొచ్చింది. ఈ ఏడాది బడ్జెట్‌లో తొలిసారిగా కొత్త లైను ప్రస్థావన వచ్చింది. దీంతో బ్రిటీష్ హయాంలో ప్రతిపాదనలో ఉన్న ఈ ప్రాజెక్టు ముందుకు సాగుతుందా, అన్న సందేహం జిల్లావాసుల్లో నెలకొంది. రెండు నెలల వ్యవధిలోనే రైల్వే సర్వే పూర్తి చేయడం సాధ్యాసాధ్యాలపై సానుకూలంగా రిపోర్టును రూపొందించడంతో ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి. సుమారు 70 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ కొత్తలైన్ వల్ల తీర ప్రాంతానికి రైలు మార్గం ఏర్పడనుంది. కృష్ణా జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలో ఉంటున్న బంటుమిల్లి, కృత్తివెన్ను వంటి మండలాల్లో రైలు కూత వినిపించనుంది. తూర్పు, కోనసీమ, పశ్చిమ, కృష్ణా జిల్లాల మధ్య దూరం తగ్గి కొత్త రైల్వేలైన్ ఏర్పడనుంది.



జంక్షన్‌గా నరసాపురం

కోటిపల్లి రైల్వే మార్గంతోనే నరసాపురం పెద్ద జంక్షన్ కానుందని, అంతా భావించారు. తాజాగా మచిలీపట్నంను కలపడంతో అతి పెద్ద జంక్షన్‌గా మారబోతుంది. ఇప్పటికే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్య మూడుకు పెరిగింది. రానున్న ట్రాఫిక్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో అమృత్ భారత్ నిధులు రూ.25 కోట్లతో అధునిక హంగులతో రైల్వేస్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా స్టేషన్‌లో ఒక ఎక్స్‌లేటర్, ఒక లిఫ్ట్, మరో ఫ్లై ఓవర్ వంతెన రానున్నాయి.

ఎన్నికల హామీని అమలు చేస్తాం : నాయకర్, ఎమ్మెల్యే



కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దాన్ని వమ్ము చేయం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తాం. దీనికి అనుగుణంగానే తీర ప్రాంతంలో రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనుల్ని వేగవంతం చేయిస్తున్నాం. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పెండింగ్ ప్రాజెక్ట్ పనులను త్వరలో ప్రారంభిస్తాం.

పొలం పిలుస్తోంది

- నేటి నుంచే వ్యవసాయ క్షేత్రాల్లోకి అధికారులు, శాస్త్రవేత్తలు
- వారానికి రెండు రోజుల చొప్పున నాలుగు నెలలపాటు అమలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ సాగుపై అధిక ప్రాధాన్యం ఇస్తోంది. రైతులకు లబ్ధి చేకూరేలా సానుకూల నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలతో రైతులను చైతన్యపరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నాలుగు నెలలపాటు నిర్వహించనున్నారు. సాగుపై వారంలో రెండు రోజులు రైతులకు అవగాహన కల్పిస్తారు. రోజుకు రెండు రైతు సేవా కేంద్రాల పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులతో గ్రామసభలు ఏర్పాటు చేస్తారు. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు పొలాల్లో అధికారులు, నిపుణులు పర్యటిస్తారు. రైతులు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకుంటారు. డ్రోన్ సాంకేతికపై అవగాహన కల్పిస్తారు. అందుబాటులో వున్న డ్రోన్‌ల ద్వారా పంట పొలాల్లో పిచికారి చేసి రైతుల్లో సాంకేతికతపై చైతన్యపరుస్తారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహిస్తారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, పంటలపై చర్చిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు అదే మండలంలో మరో రైతు సేవా కేంద్రంలో సమా వేశం ఉంటుంది. సాయంత్రం నాలుగు గంటులకు గ్రామ పరిధిలోనే క్షేత్ర సందర్శన చేస్తారు. వ్యవసాయ, పశు సంవర్థక, మత్స్య, ఉద్యాన శాఖల అధికారులు, నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. తొలిరోజు ఎమ్మెల్యేలు కార్యక్రమానికి హాజరై ప్రారంభిస్తారు. బిందు సేద్యం, ఉద్యాన సాగు, సేంద్రీయ సాగు, తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తులు వంటి అంశాలపైనా రైతులకు సూచనలు, సలహాలు ఇస్తారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది నేడు 'చలో భీమవరం'

భీమవరం అర్బన్, సెప్టెంబరు 23: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం 'చలో భీమవరం మద్యం డిపో' పిలుపునిచ్చినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రకాశ్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నూతన మద్యం పాలసీకి తాము వ్యతిరేకం కాదన్నారు. కాని, దీనిపైనే ఆధారపడి రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న సుమారు 15 వేల మందికి ప్రభుత్వం వేరే ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలన్నారు.

రేపటి నుంచి ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 23 : జిల్లా విద్యాశాఖ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికల జిల్లా క్రీడాజట్ల ఎంపికల షెడ్యూలును ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అలివేలు మంగ సోమవారం విడుదల చేశారు. ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి నిర్ణీత వేదికల్లో ఎంపికలు ఉంటాయని, క్రీడాకారులు ఎంట్రీఫారంతో సహా హాజరుకావాలని సూచించారు. ఈనెల 25న నెట్‌బాల్ ఎంపికలు గొరగనమూడి జడ్పీ హైస్కూలులో, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపికలు పెదవేగి ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలులో, హాకీ ఎంపికలు ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో జరుగుతాయి. 26న రైఫిల్ షూటింగ్ భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూలులో, మోడరన్ పెంటాథ్లాన్ ఎంపికలు తణుకు బెల్‌వెడర్ ఇంటర్నేషనల్ స్కూలులో జరుగుతాయి. 28న బాస్కెట్‌బాల్ ఎంపికలు మార్టేరు జడ్పీ హైస్కూలు, 30న రగ్బీ ఎంపికలు ఎల్‌బీ చర్ల ఏపీ సోషల్‌వెల్ఫేర్ స్కూలులో జరుగుతాయి. అక్టోబరు 1న మాల్కంబ్, రోప్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్ ఎంపికలు ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూలులో, ఫెన్సింగ్ ఎంపికలు శృంగవృక్షం జడ్పీ హైస్కూలు, బాక్సింగ్ ఎంపికలు పెనుమంట్ర జడ్పీ హైస్కూలులో జరుగుతాయని వివరించారు. వివరాలకు ఫోన్ నెంబరు 90308 94311 లో సంప్రదించాలని కోరారు.

నేడు రగ్బీ ఎంపిక పోటీలు

పెదవేగి, సెప్టెంబరు 23 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో జరుగుతున్న 19 ఏళ్ల విభాగం క్రీడాపోటీల్లో భాగంగా 24వ తేదీ మంగళవారం రగ్బీ ఎంపిక పోటీలు ఉంటాయని ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదవేగి గురుకుల విద్యాలయం పీడీ కె.జయరాజు తెలిపారు. ఉదయం పది గంటలనుంచి పెదవేగి ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో జరుగుతాయని అర్హత కలిగిన విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నరసాపురం - శంషాబాద్ ఆర్టీసీ కొత్త సర్వీస్

నరసాపురం, సెప్టెంబరు 23: నరసాపురం నుంచి శంషాబాద్‌కు ఆర్టీసీ సోమవారం నుంచి ప్రవేశపెట్టిన కొత్త ఏసీ సర్వీస్ బస్సును ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌చార్జీ పొత్తూరిలు ప్రారంభించారు. ఈ బస్సు భీమవరం, ఉండి, ఆకివీడు, ఏలూరు, విజయవాడ మీదుగా శంషాబాద్ వెళుతుంది. ఉదయం 7 గంటలకు నరసాపురంలో బయలుదేరి రాత్రి 7 గంటలకు చేరుకుంటుంది. తిరిగి మరుసటి రోజు ఉదయం శంషాబాద్‌లో 7 గంటలకు బయలుదేరుతుంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత డిపోకు నాలుగు కొత్త సర్వీసులు తీసుకొచ్చామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కొత్త బస్సులు వస్తాయన్నారు. డీఎం సుబ్బన్నరెడ్డి, ధనలక్ష్మి, తోట అరుణ, కృష్ణవేణి, పోలిశెట్టి సాంబ, కాగిత వెంకటేశ్వరావు, టి.లక్ష్మినారాయణ, పొన్నాల నాగబాబులు పాల్గొన్నారు.

దాతల సేవలు ప్రశంసనీయం : ఐజీ అశోక్ కుమార్



రోగులకు కాలిపర్స్ అందిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 23: విర్డ్ ఆసుపత్రిలో దాతల సహకారంతో రోగులకు అందుతున్న సేవలు ప్రసంశనీయమని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ అన్నారు. ద్వారకాతిరుమలలో ఉన్న విర్డ్ ఆసుపత్రిని సోమవారం ఆయన సందర్శించారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్‌తో కలసి అక్కడ ఉన్న రోగులకు కాలిపర్స్ కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. గుప్త ఫౌండేషన్ ఛైర్మన్ ఎంఎం గుప్తా సహకారంతో కాలిపర్స్‌ను తయారు చేశామని ట్రస్ట్ ఛైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. 10 మందికి కాలిపర్స్ , 8 మందికి కృత్రిమ అవయవాలను అందజేశారు. ట్రస్టీలు ఐవీఆర్ సుధాకరరావు,మూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారీ, నాగేంద్రబాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం డీఎస్పీగా విశ్వనాథ్



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 22: తాడే పల్లిగూడెం డీఎస్పీగా డి.విశ్వనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన మూర్తి ఏసీబీకి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథ్‌కు తాడేపల్లిగూడెం సీఐలు సుబ్రహ్మణ్యం, రమేష్, ఎస్సైలు శుభాకాంక్షలు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ ఓపీ విభాగం ప్రారంభం



ఏలూరు క్రైం, సెప్టెంబరు 23 : ఏలూరు సర్వజన ఆసుపత్రి నందు సోమవారం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఏబీహెచ్ఏ రిజిస్ట్రేషన్ కౌంటర్లను ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ ప్రారంభించారు. నోడల్ అధికారిణి డాక్టర్ ఉషాకిరణ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లిఖార్జున, ఆర్ఎంవో డాక్టర్ దుర్గ కుమార్, ఏబీహెచ్ఏ రిజిస్ట్రేషన్ ప్రాధాన్యాలను వివరించారు.

హోటల్స్‌పై దాడి.. 20 గ్యాస్ సిలెండర్లు స్వాధీనం



ఏలూరు క్రైం/ ఉంగుటూరు సెప్టెంబరు 23 : గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలెండర్లను వాణిజ్య అవస రాలకు వినియోగిస్తున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్స్ ఎస్పీ శ్రీరాంబాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్సు సీఐ శివరామకృష్ణ, విజిలెన్సు తహసిల్దార్ కన్యాకుమారి, విజిలెన్స్ ఏవో సురేష్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు ఉంగుటూరు మండలం నారాయణపురంలో దాడులు నిర్వహించారు. అక్కడ అమృత టిఫిన్ సెంటర్‌ను తనిఖీ చేసి 16 గృహ అవసరాల గ్యాస్ సిలెండర్లను గుర్తించి యజమాని శీలం పల్లేశ్వరరావుపై కేసు నమోదు చేశారు. వాటి విలువ 41 వేల 850 రూపాయలు అని తెలిపారు. ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామంలో మీరామదినీ హోటల్‌ను తనిఖీ చేసి నాలుగు గ్యాస్ సిలెండర్లను స్వాధీనం చేసుకుని షాపు యజమాని సయ్యద్ ఖలీల్ రెహమాన్‌పై కేసు నమోదు చేశారు. వాటి విలువ 10,700 రూపాయలు అని తెలిపారు. ఎవరైనా గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలెండర్లను వాణిజ్య పరంగా వినియోగిస్తే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు.



ఉండి ఎమ్మెల్యేపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

ఉండి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీకి ఫిర్యాదు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 23: ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణ రాజు అనుచిత ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నయీం అస్మికి సోమవారం ఎస్పీ కార్యాలయంలో దళిత నాయకులు వినతిపత్రం అందించారు. దళిత మనోభావాలను దెబ్బతీసేలా ఆర్ఆర్ఆర్ ప్రవర్తించడం దారుణం అన్నారు. ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసు కింద కేసు నమోదు చేయాలన్నారు. దళిత నాయకులు కేసీ రాజు, నెలపాటి బాస్కరరావు, పాలపర్తి జోనా, కటికతల రెజినాల్ట్, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో ఉన్న దళిత సంఘాలు చలో కలెక్టరేట్ పిలుపు నివ్వడంతో పోలీసులు దళిత నాయకుల్ని ముందుగా అరెస్టు చేశారు. భీమవరంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్‌ను ఇంటివద్ద అరెస్టు చేశారు.



ద్వారకాతిరుమల ఆలయంలో లఘు సంప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు,పండితులు.. పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి



గునుపూడి సోమేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మల్లినీడి తిరుమలరావు (బాబీ), తదితరులు

అపచార పరిహారం

తిరుమల లడ్డు అపవిత్ర నివృత్తి కోసం ఆలయాల్లో పూజలు

ద్వారకాతిరుమలలో లఘు సంప్రోక్షణ, శాంతిహోమం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 23: తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో ఏర్పడిన అపచారం కారణంగా ఎటువంటి అరిష్టాలు జరుగకుండా ద్వారకాతిరుమల వేకంటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లఘు సంప్రోక్షణ, మహాశాంతి హోమం నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొని మాట్లాడుతూ లడ్డూ ప్రసాదం విషయంలో ఏర్పడిన అపచారం గత ప్రభుత్వ పాపమేనని ఈ ప్రభుత్వం దాని కారణంగా ఎటువంటి అరిష్టాలు జరుగకుండా ఆలయాల్లో ఈ పూజలు నిర్వహిస్తు న్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన అపచారాలు ఈ ప్రభుత్వంలో జరుగవని హామీ ఇస్తున్నామని దైవసన్నిధిలో ఎక్కడా పవిత్రతకు భంగం వాటిల్లకుండా చూస్తామన్నారు.లంకా సత్యన్నారాయణ, పోలిన శ్రీనివాస రావు, మొగతడకల ఓంప్రకాష్ చౌదరి, దేవస్థానం ఈఈ డీవీ భాస్కర్, ఏఈవో నటరాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదాల తయారీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

చినవెంకన్న ఆలయంలో ప్రసాదాల తయారీ విభాగాన్ని, తయారీకి వినియోగించే నెయ్యిని, సెంట్రల్ స్టోర్‌లో నిల్వ ఉండే సరుకులను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పరిశీలించారు. నేతి డబ్బాలను, ఇతర సరుకులను వాటి ఎక్సైరీ తేదీలను పరిశీలించారు. ప్యాకింగ్‌కు సిద్ధంగా ఉన్న లడ్డూ ప్రసాదాలను తనిఖీ చేశారు. ప్రసాదాన్ని తిన్నారు. శ్రీవారి క్షేత్రంలో అన్ని విభాగాల్లో ప్రతీరోజూ క్వాలిటీ కంట్రోల్ చెక్‌లు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు



భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 : తిరుపతి లడ్డూ ప్రసాదం అపవిత్రమైన నేపథ్యంలో క్షమించమని వేంకటేశ్వరస్వామిని కోరుతూ జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారని, సనాతన ధర్మాన్ని రక్షించుకుందామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రోటోకాల్ ఛైర్మన్ మల్లినీడి తిరుమలరావు (బాబీ) అన్నారు. పంచారామ క్షేత్రమైన గునుపూడి ఉమా సోమేశ్వర జనార్ధనస్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. బాబీ మాట్లాడుతూ తిరుమల పవిత్రతను కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. చల్లా రాము, మద్రాసు బాబీ, సాయి, కిషోర్, శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.



నరసాపురంలో ఆందోళన చేస్తున్న నాయకర్, కొత్తపల్లి, పొత్తూరి

దోషుల్ని శిక్షించాలి : ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం టౌన్, సెప్టెంబరు 23: తిరుపతి శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని కల్తీ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం నరసాపురంలో హిందుసంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు. వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని చేతబట్టి దోషుల్ని శిక్షించాలంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌ఛార్జీ రామరాజు, కొవ్వలి నాయుడు, బీజేపీ నాయకులు పీవీఆర్‌ల ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా వందలాది మంది ఈ ఆందోళనలో పాల్గొన్నారు. పట్టణంలోని పలు ఆలయాల అర్చకులు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో అంబరీష్‌కు వినతి పత్రం అందించారు.దోషుల్ని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే నాయకర్ డిమాండ్ చేశారు. జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, అత్మూరి నరసయ్య, దొండపాటి స్వామి, కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని, వైఎస్ బాబులు, వన్నెంరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దెందులూరులో నిరసన

దెందులూరు, సెప్టెంబరు 23 : తిరుమల తిరుపతి ప్రసాదం కుడా కల్తీ చేయడం చాలా దారుణమని దెందులూరు గ్రామానికి చెందిన ప్రగతి విద్యా సంస్థల ఛైర్మన్ మెటపర్తి రాజా అన్నారు. దెందులూరు మండల కేంద్రం ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద విజయనగేష్ డీఈడీ కాలేజీ కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, రామదండు, గ్రామస్తుల ఆధ్వర్యంలో శాంతి యుతంగా నిరసన చేపట్టారు. దీపారాధన చేసి నిరసన నిర్వహించారు. దేవినేని తులసీదాస్, వీరమాచినేని శివాజీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీకి ఎదురు దెబ్బ



జడ్పీ సమావేశాన్ని స్తంభింప చేయాలని వ్యూహం
తాడేపల్లిగూడెంలో సమావేశం.. జిల్లా ముఖ్య నేతలు హాజరు
సగం మంది జిల్లా పరిషత్ సభ్యులు గైర్హాజరు
మాజీ మంత్రి కొట్టుకు అవమాన భారం
స్థానిక జడ్పీ సభ్యులు దూరం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 23: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. జిల్లా పరిషత్ సమావేశాలను స్తంభింప చేయాలంటూ వైసీపీ వ్యూహం ఆదిలోనే బెడిసి కొట్టింది. సొంత పార్టీ జిల్లా పరిషత్ సభ్యులే ముఖం చాటేశారు. తాడేపల్లిగూడెంలో జిల్లా పరిషత్ సభ్యులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద రాజు నేతృత్వంలో సమావేశం జరిగింది. మాజీ మంత్రులు కొట్టు సత్య నారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, వేణుగోపాల్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌లు సమావేశం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. అంతర్గతంగా చర్చించుకున్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీ ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరడంతో తాడేపల్లిగూడెంలో వైసీపీ నిర్వహించిన సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. జడ్పీలో 48 మంది సభ్యులకు 46 మంది వైసీపీకి చెందినవారు. మిగిలిన ఇద్దరు తెలుగుదేశం పార్టీ తరపున నెగ్గారు. ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ రాజీనామాతో వైసీపీకి షాక్ తగిలింది. జిల్లా పరిషత్ సభ్యులతో బలప్రదర్శన చేయాలని భావించిన వైసీపీకి సోమవారం సమావేశంలో చుక్కెదురైంది. సమావేశానికి 23 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. బలం కూడా తగ్గిపోయింది. ఛైర్‌పర్సన్ వైపే అత్యధికులు మొగ్గు చూపుతున్నట్టు సమావేశం తీరుతో బట్టబయలైంది. సమావేశానికి హాజరైన తమ పార్టీ జిల్లా పరిషత్ సభ్యులకు రాబోయే సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు నూరి పోశారు. అయితే సభ్యుల హాజరు తక్కువగా ఉండడంతో నేతలు కాసింత ఢీలా పడ్డారు. అవిశ్వాసం పెట్టాలంటూ కొందరు సభ్యులు ప్రతిపాదించారు. నిబంధనల మేరకు అవిశ్వాస తీర్మానం చెల్లదంటూ నేతలు వివరించారు. మూడు సమావేశాలకు గైర్హాజరు కావాలంటూ నేతలు సభ్యులకు సూచించారు. దీనివల్ల సభ్యులే సస్పెండ్ అవుతారని తేలడంతో ఆ ప్రతి పాదనను కూడా విరమించుకున్నారు. చివరకు ప్రతి అంశంపై గట్టిగా మాట్లాడి సభను స్తంభింప చేయాలంటూ నేతలు కర్తవ్యబోధ చేశారు. తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సమావేశానికి అదే నియోజక వర్గంలో ఉన్న ఇద్దరు జిల్లా పరిషత్ సభ్యులు కూడా హాజరు కాలేదు. వారిద్దరూ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. సమావేశానికి అందువల్లే హాజరుకాలేదంటూ ఇప్పుడు అదే పార్టీలో చర్చ నడుస్తోంది. ఇది మాజీమంత్రి కొట్టుకు ఇరకాటంలో పెట్టినట్టయ్యింది.

కీలక నేతలు డుమ్మా

సమావేశానికి వైసీపీ కీలక నేతలు సైతం దూరంగా ఉన్నారు. జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, చెరుకువాడ రంగరాజులు హాజరుకాలేదు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సమావేశానికి కూడా వీరిద్దరూ దూరంగా ఉన్నారు. జిల్లాలో పార్టీ కేడర్‌ను మళ్లీ సమాయత్తం చేసేలా సంకేతాలు పంపేందుకు జిల్లా పరిషత్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశానికి కూడా గైర్హాజరయ్యారు. ఇప్పటికే ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని వైసీపీకి రాజీనామా చేశారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీ తెలుగుదేశంలో చేరారు.

చిదిమేసిన జలఖడ్గం

కొండరాళ్ల తాకిడికే ఆశ్రం మెడికోల మృత్యువాత
ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు లభ్యం
మరొక విద్యార్థి కోసం గాలింపు



ఈ ప్రవాహ వేగంలోనే కొట్టుకుపోయారు..

మారేడుమిల్లి/ ఏలూరు టుటౌన్, సెప్టెంబరు 23: ఆనందంలో మునిగి తేలుతున్న ఆ క్షణాలు.. వారికి చివరి క్షణాలయ్యాయి. వైద్య విద్యతో ఒకరికి ప్రాణ దానం చేయాల్సిన వీరిని మృత్యువు.. క్షణాల్లో విగత జీవులుగా మార్చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లికి ఆది వారం ఏలూరు ఆశ్రమ వైద్య కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు విచ్చేశారు. జలతరంగిణి జలపాతంలో ఐదుగురు కొట్టుకు పోగా వీరిలో గాయత్రి పుష్ప, చింతా హరిణిప్రియ గాయాలతో బయట పడ్డారు. దీంతో పోలీసులు,ఎన్డీఆర్ఎఫ్, ఏపీఎస్పీ ఆర్ఎఫ్‌కు చెందిన బృందాలు మొత్తం 40 మంది ఆదివారం సాయంత్రం నుంచి మిగిలిన ముగ్గురి కోసం తీవ్రస్థాయిలో గాలించింది. ఆదివారం అర్ధరాత్రి విజయనగరం జిల్లా బొబ్బిలి సమీపంలోని డొంకినవలస గ్రామానికి చెందిన బాలి అమృత (22) మృతదేహన్ని కనుగొన్నారు. సోమవారం తెల్లవారు జామున ఐదు గంటల సమయంలో బొబ్బిలికి చెందిన కొసిరెడ్డి సౌమ్య(21) మృత దేహన్ని కనుగొన్నారు. మరొక విద్యార్థి ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట్ల హరిదీప్ (20) ఆచూకీ లభ్యం కాలేదు. రంప చోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ బృందాలు సోమవారం రాత్రివరకు గాలింపు కొనసాగిస్తున్నారు.

జలతరంగిణి విలయ తాండవం

మెడికోలు ఆదివారం మధ్యాహ్నం ఒకటిన్నర -రెండు గంటల మధ్య ఇక్కడ స్నానాలకు దిగారు. అప్పటికే వర్షం మొదలైంది. దీనికితోడు కొండల్లోంచి భారీగా వరదనీరు ముంచెత్తింది. ఒక ఉప్పెన మాదిరిగా విలయతాండవం చేస్తూ ఒక్కసారిగా జలతరంగిణి భయోత్పాతం సృష్టించింది. మొత్తం 14 మంది మెడికోలకుగాను ఐదుగురు చిక్కుకుపోయారు. వీరిలో ఒకరు ఏదోలా బయటపడగా, మరొకరిని సమీ పంలో కాజ్‌వే వద్ద రక్షించారు. ఇక మిగిలిన వారిలో అమృత మృతదేహం జలతరంగిణి నుంచి కొట్టుకుపోయి ఒకటవ కాజ్‌వే దాటిన తర్వాత ఇసుక దిబ్బ వద్ద లభ్యమైంది. ప్రవాహ వేగానికి రాళ్లకు కొట్టుకుపోవడంతో నుదుటి మీద, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షణాల్లోనే మృతి చెందినట్టు భావిస్తున్నారు. సౌమ్య మృతదేహం కూడా అదే ప్రాంతంలోని తుప్పల్లో చిక్కుకుపోయింది. సౌమ్యకు తీవ్ర గాయాలుకావడంతో పాటు ముఖం ఛిద్రమైంది. రాళ్ల దెబ్బలకు తగిన గాయాలకే ఆమె కూడా మృతి చెంది ఉండొచ్చని తెలుస్తోంది. జలఖడ్గంలా వచ్చిన పడిన ప్రవాహం వర్షం తగ్గిన తర్వాత కొద్దిసేపటికే కొంత తగ్గుముఖం పట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ప్రవాహం మొదటి కాజ్‌వే ప్రాంతంలో ఏకంగా ఏడడుగులు పైనే ఉంటుందని చెబుతున్నారు. మళ్లీ సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా వర్షం కురవడం, జలతరంగిణి వద్ద ఒక్కసారిగా జల ప్రవాహం పెరిగిపోయింది. దాంతో గాలింపు చర్యలను సైతం నిలిపి వేయాల్సి వచ్చింది. సాయంత్రం వర్షం తగ్గాక మరొక విద్యార్థి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. జలతరంగిణి నుంచి పాములేరు వాగు వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు ఉంటుంది.

క్రైమ్ కార్నర్



గాలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

పోక్సో కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23 : ఒక మహిళ తనకు ఇద్దరు కుమార్తెలు పుట్టిన తరువాత భర్త మరణించడంతో దగ్గర బంధువును వివాహం చేసుకుంది. అప్పటికే ఆమె కుటుంబ నియంత్ర ఆపరేషన్ చేసుకోవడంతో చేసుకున్న భర్త తనకు మగపిల్లలు కావాలని వేధించడంతో చివరకు తన కుమార్తెలను భర్త వద్దకు పంపించింది. ఈ సంఘటనపై ఏలూరు దిశ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా వారిద్దరికి జీవిత ఖైదు విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి ఉమాసునంద సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన మహిళకు (32) ఇద్దరు కుమార్తెలు. ఒక కుమార్తె ఇంటర్మీడియట్, ఇంకో కుమార్తె పదో తరగతి చదువుతున్నారు. భర్త చనిపోవడంతో సమీప బంధువును వివాహం చేసుకుంది. ఆమెకు అప్పటికే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ జరిగింది. తనకు మగ సంతానం కావాలని ఆమెను వేధించడంతో తనకు బిడ్డ పుట్టే అవకాశం లేదని తన కుమార్తెల ద్వారా సంతానం పొందాలని సూచించింది. బాలికలపై ఆమె భర్త అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతేకాకుండా వారిద్దరి చేత ఇంట్లోనే ప్రసవాలు జరిపిం చాడు. పెద్ద కుమార్తెకు ఆడ శిశువు జన్మించగా, చిన్న కుమార్తెకు మగ శిశువు జన్మించి పుట్టిన వెంటనే మరణించాడు. వీరికి ఆ ప్రాంతంలోని సచివాలయ ఏఎన్ఎం ,ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేసే ఒక వ్యక్తి సహకరించారు. అత్యాచారానికి గురైన బాలికలు ఏలూరు దిశ పోలీసులకు తమ బంధువుల సహకారంతో ఫిర్యాదు చేయగా గతేడాది జూలై నెలలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఇంద్ర శ్రీనివాస్ కేసు నమోదు చేసి భార్య, భర్తలు ఇద్దరినీ అరెస్టు చేశారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ నున్నా మురళీకృష్ణ ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ సాగింది. నిందితులు ఇద్దరిపై నేరం రుజువు కావడంతో వారిద్దరికి జీవిత ఖైదు శిక్ష, ఒకొక్కరికి 28 వేల రూపాయలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టులో తీర్పు చెప్పారు. సహకరించిన ఇద్దరికీ రెండేళ్ళ పాటు సత్‌ప్రవర్తన కల్గి ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. బాధిత బాలికలకు ఒకొక్కరికి 10 లక్షల రూపాయలు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ రామాంజనేయులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బ్రహ్మయ్య వాదించారు.ప్రాసిక్యూషన్‌కు కోర్టు లైజన్ ఆఫీసర్ సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుల్ రమణ, కోర్టు కాని స్టేబుల్ లక్ష్మీనారాయణ సహకరించారు.

ఇసుక అక్రమ రవాణా..నాలుగు ట్రాక్టర్లు సీజ్

పోలవరం సెప్టెంబరు 23 : పోలవరం మండలంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్ కుమార్ సోమవారం తెలిపారు. పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు, పట్టిసీమ గ్రామానికి చెందిన ఒక ట్రాక్టరు, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రాంపాలెం గ్రామానికి చెందిన ఒక ట్రాక్టరుని కొవ్వాడ కాలువ ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

దెందులూరు, సెప్టెంబరు 23 : ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొన్న ప్రమాదంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చేబ్రోలు గ్రామం దగ్గర రాచూర్‌కు చెందిన ఇద్దరు న్యాయవాదులు ఏలూరు నుంచి చేబ్రోలు వెళ్తుండగా సత్యనారయణపురం దాటిన తరువాత ఒక ప్రైవేటు హోటల్ సమీపంలో ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొనడంతో కారు నడిపే వ్యక్తితో పాటు మరో యువకుడి తీవ్ర గాయాలయ్యాయి. కారు నుజ్జునుజ్జు అయింది. దెందులూరు పోలీసులు వారిని ఏలూరు ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థినికి పాము కాటు..బంధువుల ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 23: కళాశాలలో పాముకాటుకు గురైన విద్యార్థిపట్ల యాజమాన్యం ఉదాసీన వైఖరి వల్ల విద్యార్థి తీవ్ర అస్వస్థకు లోనైందని విద్యార్థిని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెంలోని ఓ కళాశాల వద్ద సోమవారం విద్యార్థి బంధువులు ఆందోళన చేపట్టారు. దీనికి సంబంధించి విద్యార్థి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఉంగుటూరు మండలం నీలాద్రిపురానికి చెందిన సీహెచ్ వర్షిణి ఈనెల 19న పాముకాటుకు గురైంది. అయితే సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లడంలో ఆరు గంటలు ఆలస్యం చేయడంతో విషం బాగా రక్తంలో కలిసిపోవడంతో రెండు డోసుల యాంటి స్నేక్ వీనం చేయాల్సి వచ్చిందని ఆరోపించారు. దీనిపై యాజమాన్యం స్పందించి విద్యార్థుల ప్రాణాలతో ఆటలాడకుండా రేకుల షెడ్‌లో క్లాసులు పెట్టడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరవల్లిలో బంగారం చోరీ

అత్తిలి, సెప్టెంబరు 23 : ఆరవల్లి గ్రామంలో ఇంటిలోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 10 కాసులు బంగారం, అరకేజీ వెండి దొంగలించుకుపోయారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామానికి చెందిన కర్రి సునీత ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నది. భర్త సతీష్‌రెడ్డి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో ఉండగా మూడు సంవత్సరాల నుంచి పిల్లలు, అత్తగారితో కలిసి ఉంటున్నది. ఆదివారం రాత్రి వేరేచోట ఉంటున్న మామయ్య ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులుగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూసేసరికి బీరువాలో ఉన్న 10 కాసుల బంగారం, అర కేజీ వెండి దొంగిలించుకుపోయినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

అంతర్ జిల్లాల మోటారు సైకిళ్ల దొంగల ముఠా అరెస్టు

రూ.47 లక్షల విలువైన 60 మోటారు సైకిళ్లు స్వాధీనం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 23 : మారుతీ కారులో సంచరిస్తూ క్షణాల్లో మోటారు సైకిళ్ళను అపహరించుకుపోయి తక్కువ ధరలకు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ కిషోర్ సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఏలూరు కొత్తపేటకు చెందిన పులిగడ్డ జగదీష్‌బాబు (31), ఏలూరు గన్‌బజార్‌కు చెందిన ఆగడం సూర్యప్రకాష్ (18), ఏలూరు మండలం పాలగూడెం జగన్నాధకాలనీకి చెందిన పంజరపు శ్రీనివాస్(18), దెందులూరు మండలం గాలాయిగూడానికి చెందిన బొడ్డు లక్ష్మణ్‌కుమార్ (18), ఏలూరుకు చెందిన ఒక మైనర్ బాలుడు (17)లు ఒక ముఠాగా ఏర్పడి ఏలూరు,పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా, ప్రకాశం, గుంటూరు జిల్లాలలో మారుతీ 800 కారులో తిరుగుతూ ఎక్కడైనా మోటారు సైకిళ్ళు నిర్మానుష్యంగా పార్కింగ్ చేసి ఉంటే క్షణాల్లో తాళాలు తీసి స్టార్ట్ చేసి చోరీ చేసి తక్కువ ధరకు తాకట్లు పెట్టడం, విక్రయించడం చేస్తున్నారు. జిల్లాలో మోటారు సైకిళ్ళ దొంగతనాలు జరుగుతున్నాయని వాటిపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాలు ఇవ్వడంతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు, దెందులూరు ఎస్ఐ కె.స్వామి వారి సిబ్బంది నిఘా ఏర్పాటు చేసి ఈ ముఠాను అరెస్టు చేశారు. వీరి నుంచి 25 లక్షల రూపాయల విలువైన 31 మోటారు సైకిళ్ళను స్వాధనం చేసుకున్నట్టు ఎస్పీ చెప్పారు. చెడు వ్యసనాలకు బానిస అయిన పులిగడ్డ జగదీష్‌బాబు, మోటారు సైకిల్ మెకానిక్ అయిన ఆగడం సూర్య ప్రకాష్‌తో పాటు వంజరపు శ్రీనివాస్, బొడ్డు లక్ష్మణ్‌కుమార్, పటాన్ నాగూర్‌మేర, చీకట్ల సతీష్ అనే వ్యక్తితో ఒక ముఠాగా ఏర్పడి కారులో వెళ్ళి నేరాలకు పాల్పడుతున్నారు. వీరి నుంచి రికవరీ చేసిన 31 మోటారు సైకిళ్ళల్లో 24 మోటారు సైకిళ్ళు వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయినవని, మరో ఏడు మోటారు సైకిళ్ళ వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ప్రతిభ చూపించిన పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు, సీఐ రాజశేఖర్, దెందులూరు ఎస్ఐ స్వామి, హెడ్ కాని స్టేబుల్ అమీర్, కానిస్టేబుళ్ళు పండు, చంద్రమౌళి, సీహెచ్ సురేష్, నాగాంజ నేయులు, కనకారావు, హోంగార్డు రవికుమార్‌లను ఎస్పీ అభినందించి నగదు రివార్డులను అందించారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న ఏలూరు ఎస్పీ కిశోర్

గణపవరంలో ఒకరి అరెస్టు..29 మోటారు సైకిళ్లు స్వాధీనం

గణపవరం, సెప్టెంబరు 23: గణపవరం మండలం ముగ్గుళ్ళ గ్రామానికి చెందిన శెట్టి చిన్న(33) చెడు వ్యసనాలకు బానిసై కొయ్యలగూడెం మండలం చొప్పరామన్నగూడెం గ్రామానికి చెందిన చప్పిడి ముసలయ్య అలియాస్ కేసీఆర్ అనే వ్యక్తితో కలిసి వివిధ జిల్లాలో అనేక మోటారు సైకిళ్ళ దొంగతనాలకు పాల్పడ్డాడు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిడమర్రు సీఐ సుభాష్, సీఐ రాజశేఖర్, గణపవరం ఎస్ఐ మణికుమార్ వారి సిబ్బంది నిఘా ఏర్పాటు చేసి శెట్టి చిన్నాను అరెస్టు చేశారు. అతని నుంచి 22 లక్షల రూపాయల విలువైన 29 మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్ళల్లో 15 మోటారు సైకిళ్ళు వివిధ కేసుల్లో పోలీస్ స్టేషన్‌లో నమోదు అయ్యాయని, మిగిలిన 14 మోటారు సైకిళ్ళ వివరాలు తెలియాల్సి ఉందన్నారు. చప్పిడి ముసలయ్యను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. గణపవరం ఎస్ఐ ఫణికుమార్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుల్ రాజేష్, కాంతయ్య, రత్న ప్రసాద్, నాగరాజు, హోంగార్డు జగపతులను ఎస్పీ అభినందించారు



సేవా భావం పెంచే ఎన్ఎస్ఎస్

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 : ఎన్ఎస్ఎస్ ద్వారా యువతలో జాతీయ సేవా భావాలు పెంపొందుతాయని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆర్ఆర్‌డిఎస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహిస్తామని, భీమవరంలోని 24 మంది వివిధ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లుకు ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించి సత్కరించారు.

కృషి, పట్టుదలకుతో లక్ష్య సాధన



పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 23 : ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే కృషి, పట్టుదల తో పాటు అంకిత భావం కలిగి ఉండాలని నరసాపురం సబ్ కలెక్టర్ డాక్టర్ ఎంప అంబరీష్ అన్నారు. స్థానిక కెవిఎం ఛాంబర్స్ జూనియర్ కళాశాల 50వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. కళాశాల పాలక మండలి చైర్మన్ నరసింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల స్వర్ణోత్సవ వేడుకలతో పాటుగా బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ కళాశాల 30వ వార్షికోత్సవం నిర్వహించారు. జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ లోగోను, డిగ్రీ కళాశాల మౌక్తిక రజతోత్సవం (30 ఏళ్ళు) లోగోలను ముఖ్యఅతిథి ఆవిష్కరించారు. కళాశాల ప్రగతిని కార్యదర్శి కలిదిండి రామరాజు వివరించారు. సబ్ కలెక్టర్‌ను సత్కరించారు. అనంతరం కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 : ప్రతిభ పేదరికం అడ్డు కాకూడదని, ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే విద్యలో మరింత రాణిస్తారని, ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని శ్రీమాతా ట్రస్ట్ కరుకువాడ, ట్రస్టు ఫౌండర్ కడియం జయనార్ధన్ యూఎస్‌ఏ నుంచి ఆడియో సందేశంలో అన్నారు. భీమవరం మండలం బేతపూడి జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతిలో మొదటి ఐదు స్థానాలు సాధించిన విద్యార్థులకు చెక్కులను మద్దాల ఏసుప్రసాద్ అందజేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థుల వితరణ



భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు నిత్యావసరాలు సమకూర్చి విజయవాడ పంపినట్టు కళాశాల డైరెక్టర్ ఎం శ్రీనివాస్ తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ. అనూరాధ మాట్లాడుతూ వీటిని కళాశాల వాహనంలో విజయవాడ పంపామన్నారు. వాహనాన్ని కళాశాల డైరెక్టర్ ఎం. శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బ్రహ్మం, అధ్యాపకులు పాల్గొన్నారు.

తణుకు: విజయవాడ వరద బాదితులకు తణుకులోని హోప్ ఫర్ లైఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ వెళ్ళి పలువురు దాతలు నుంచి సేకరించిన దుస్తులు, దుప్పట్లు, బియ్యం ప్రత్యేక వాహనం ద్వారా సామాజిక వేత్త ఆశాజ్యోతి ఆద్వర్యంలో అందజేశారు. ప్రదీప్, శివరామకృష్ణ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవ

పెనుగొండ, సెప్టెంబరు 23: భాగంగా వడాలిలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మి ఆధ్వర్యంలో రహదారుల పక్కన ఉన్న చెత్తను శుభ్రం చేశారు. ఉప సర్పంచ్ నరేష్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు చంటి, కార్యవర్గ సభ్యులు మేకా శివయ్య, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

క్షీరారామం ఈవోగా ముచ్చర్ల

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 23 : స్థానిక శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామివారి ఆలయ కార్యనిర్వాహణాధికారిగా తాత్కాలిక బాధ్యతలు నిర్వహిస్తున్న ముచ్చర్ల శ్రీనివాసరావుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ శాఖ కమీషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈసందర్భంగా ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

నేడు దర్శిపర్రులో పొలం పిలుస్తోంది

పెంటపాడు, సెప్టెంబరు 23: మంగళవారం ఉదయం 10 గంటలకు మండలంలో నూతనంగా నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని దర్శిపర్రు గ్రామంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభిస్తారని మండల వ్యవసాయాధికారి కే.పార్థసారథి తెలిపారు. అలాగే ఈ నెల 24, 25 తేదీల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం కూడా జరుగుతుందని రైతులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నరసాపురం రూరల్: మండలంలోని గొంది, మొగల్తూరు మండలంలోని శేరేపాలెం, యలమంచిలి మండలాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. ఎమ్మెల్యే నాయకర్ విచ్చేస్తారన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 22: తాడేపల్లిగూడెంలోని 33కేవి సబ్ స్టేషన్ మరమ్మత్తుల నిమిత్తం పట్టణంలోని, మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు.

నేడు ఎల్‌బీ చర్లలో క్రీడలు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 23: మండలంలోని ఎల్‌బీ చర్ల హైస్కూల్ క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. పట్టణ, మండలం, మొగల్తూరు మండలాలకు చెందిన స్కూల్ విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చున్నారు.

800 ఎకరాలకు సాగునీరందటంలేదు..

గణపవరం, సెప్టెంబరు 23: మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, ఆయకట్టులోని సుమారు 800 ఎకరాలకు సాగునీరు లభించక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా మండపాక సెక్షన్ నుంచి గుమ్మంపాడు ఛానల్ నుంచి వయ్యేరు ద్వారా సాగునీరు రావల్సి ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వ పాలనలో కనీసం మరమ్మత్తులు చేపట్టకపోవడంతో సాగునీరు లభించటం లేదని రైతులు అల్లూరి బదిరి నారాయణ, దండు రామచంద్రరాజు వాపోయారు.

సంక్షిప్త సమాచారం..

- **పెనుగొండ, సెప్టెంబరు 23 :** కళా గౌతమి తెలుగు సారస్వత పరిషత్ రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న నవ యుగ కవి చక్రవర్తి పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా జయంతి వేడుకలకు ప్రధాన వక్తగా, జాషువా అవార్డు గ్రహీతగా ఎస్‌వీకేపీ పీవీ జూనియర్ కళాశాల తెలుగు శాఖాధిపతి ఏజీఎం సి. చైర్మన్‌ప్రముఖ కవి డాక్టర్ బాల చందర్ సాదే ఎంపికయ్యారు.
- **మొగల్తూరు:** చవితి వేడుకలు ముగింపు సందర్భంగా స్థానిక స్నేహ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.
- **పాలకొల్లు అర్బన్:** స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జలశక్తి అభియాన్‌పై సెమినార్‌ను నిర్వహించారు.
- శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో క్షీరారామంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మహిళలతో శ్రీవేంకటేశ్వరస్వామి వారి దీపారాధన, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణలు ఏర్పాటు చేసినట్టు సేవా సమితి అధ్యక్షుడు శీరం ఆనంద కృష్ణ తెలిపారు.
- **నరసాపురం టౌన్:** ఎస్సీ వర్గీకరణ చట్ట సవరణ పార్లమెంట్‌లోనే జరగాలని మాలల న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు సోడదాసి శ్రీధర్ డిమాండ్ చేశారు.
- **పెంటపాడు:** ప్రత్తిపాడు వై.జంక్షన్ దుర్గమ్మ ఆలయం వద్ద దసరాను పురస్కరించుకుని ఈవో శ్రీదేవి ఆధ్వర్యంలో రాటను ప్రతిష్ఠించారు.





కోడేరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని, తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

100 రోజుల్లోనే సంక్షేమ పథకాలు అందించాం

ఆచంట, సెప్టెంబరు 23: మాజీ సీఎం జగన్ రాష్ట్రాన్ని అన్నివిధాలా నాశనం చేసి ఇపుడు నీతి కబుర్లు వల్లిస్తున్నాడని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆచంట మండలం కోడేరు, వల్లూరులో ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక నిర్వహించారు. ఎమ్మెల్యే పితాని ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టారని, తనపై కూడా అక్రమ కేసు పెట్టారన్నారు. వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాబోయే ఐదేళ్లలో కోడేరు నుంచి గన్నవరం బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సర్పంచ్‌లు కనకదుర్గ, నేలపూడి బేబి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సురేష్ బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని 23వ వార్డులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది నాయకులు దిగజారుడు విమర్శలు చేస్తున్నారన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కౌన్సిలర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి అన్నారు. సోమవారం మౌంజిపాడులో సచివాలయం ఉద్యోగులతో ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేసారు.

యలమంచిలి: రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు పేర్కొన్నారు. మేడపాడులో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో చేసిన దుర్మార్గాలను ప్రజలు మరిచిపోలేదని.. ఇప్పుడున్న మంచి ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పటికీ ఆశీర్వదిస్తూనే ఉంటారని అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతం చేశారు.

ఆకివీడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో అనేక మంచి కార్యక్రమాలు చేయడం జరిగిందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి అన్నారు. సోమవారం స్థానిక కోసూరి వీధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై ప్రజలకు వివరించారు. హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జాకీర్, జిల్లా కార్యదర్శి అజ్మల్ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పాలకోడేరు: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు ఎన్నో ఉపయోగకర కార్యక్రమాలు చేపట్టినందునే ఇది మంచి ప్రభుత్వమని ప్రజలు నమ్మారని టీడీపీ నాయకుడు కునాధరాజు మురళీకృష్ణంరాజు అన్నారు. పాలకోడేరు గ్రామంలో ఇంటింటికి వెళ్ళి 100 రోజుల కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరిస్తూ స్టిక్కర్లు అంటించారు. గుత్తుల సత్యనారాయణ, కల్యాణ్, రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రభుత్వ ప్రగతిపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. బండారు సోమేశ్వరరావు, కట్రెడ్డి శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాస్, కటారి నరసింహరాజు, ముదుండి రాజేష్, బూడి పత్రాలు పాల్గొన్నారు.

ఆకివీడు రూరల్: హామీలు అమలు చేస్తూ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న మంచి ప్రభుత్వం టీడీపీ అని తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. తిమ్మరాజు అన్నారు. ఆకివీడు మండలం సిద్ధాపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి ప్రభుత్వ పనితీరు వివరించారు.



కలెక్టర్ నాగరాణికి చెక్కు ఇస్తున్న విద్యార్థులు





ఎమ్మెల్యే అంజిబాబుకు విరాళాలు అందిస్తున్న ఏపీ సీ ఫుడ్ సప్లయర్స్ సంఘం, జీవీటీ గ్రూప్

వరద బాధితులకు ఆపన్న హస్తం



కలెక్టర్‌కు దాట్ల పరిపూర్ణావతి విరాళం

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 : సోమవారం వీరవాసరం మండల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భీమవరం కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి విజయవాడ వరద బాధితులకు రూ.3,04,160 విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కును విద్యార్థుల చేతుల మీదుగా అందజేశారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. డిఆర్‌వో జె ఉదయభాస్కరరావు, డీఈవో జి. నాగమణి, వీరవాసరం మండల విద్యార్థులు ఉన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విజయవాడ బాధితుల సహాయార్థం జీవీఐటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ రూ.లక్ష సహాయాన్ని ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. దాతల సహకారం ఎంతో విలువైందని వారిని ఎమ్మెల్యే అభినందించారు. జీవీఐటీ గ్రూప్ గ్రంధి సురేష్, గ్రంధి వెంకటేశ్వరరావు, ఆరేటి కాశీ విశ్వేశ్వరరావు, వైవిఎస్ అప్పారావు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గొల్లలకోడేరుకు చెందిన వయోవృద్ధురాలు దాట్ల పరిపూర్ణావతి తాను దాచుకున్న నగదులో కొంత మొత్తాన్ని వరద బాధితుల సహాయం నిమిత్తం అందజేయడం చాలా గొప్ప విషయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో మీ కోసం సమావేశం మందిరంలో వీరు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి విజయవాడ వరద బాధితుల సహాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళ్ళ మండలం మాలవానితిప్ప జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.25,825, ఆచంట మండలం భీమాలపురం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు రూ.13,500, భీమవరం మండలం చినఅమిరం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు రూ.10 వేలు విరాళం అందించారన్నారు.

సీఫుడ్స్ సప్లయర్స్ సంఘం..

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ సీ ఫుడ్స్ సప్లయర్స్ అసోసియేషన్ రూ.2 లక్షల 70 వేలను ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. దాతలు భీమాల శ్రీరామమూర్తి, ఎ రవిచంద్ర (నెల్లూరు), కామన రాంబాబు, లింగం నాగేశ్వరరావు, ఎండీ అస్లామ్ రూ.25వేలు చొప్పున, కోరా రామమూర్తి, భక్తాని శ్రీనివాస్ (నెల్లూరు) రూ. 15 వేల చొప్పున, భోగిరెడ్డి శ్రీనివాస్, యర్రా రవిరాజు, కోళ్ళపర్రు స్వామి, నూకల శ్రీనివాసరావు, యర్రా రవిరాజు, మట్టా నాగబాబు, జీటీటీ సురేష్, కటికల పల్లారావు, ఆలపాటి తులసి వెంకటరమణ రూ.10 వేలు చొప్పున, మతకన పిచ్చయ్య, పెన్నాడ శ్రీను, దేవరపు రఘు (వైజాగ్), వన్నెంరెడ్డి పరమేశ్, రాంబాబు (తోలేరు), సిహెచ్ పోసిరావు, కొప్పర్తి రామేష్ బాబు రూ.5వేలు చొప్పున మొత్తం 2లక్షల 70వేలను ఎమ్మెల్యేకు అందించారు.



పెంటపాడులో ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

పెంటపాడు, సెప్టెంబరు 23 : కష్టపడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్లా పుల్లారెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి శ్యామలా కుమారి అన్నారు. కేంద్ర ప్రజా సంఘాల పిలుపు మేరకు సోమవారం పెంటపాడు గేటు సెంటర్ వద్ద బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దూలం ప్రసాద్, పెనగంటి దుర్గా, ఆర్.అనురాధ, మల్లు సీత, వై.జయంతి, బీ.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పక్కనబెట్టి కొత్త సమస్యలను ప్రజల మీద నెడుతోందని కార్మిక సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా భీమవరంలో బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్షులు జెఎన్వీ గోపాలం, ఏఐటీయుసీ నాయకులు సీహెచ్ రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుగుణంగా ఉండే విధానాలు అవలంబిస్తోందన్నారు. సీఐటీయు నాయకులు పాల్గొన్నారు.

తణుకు: కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయకపోతే మోడి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ హెచ్చరించారు. సోమవారం నరేంద్ర సెంటర్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు గార రంగారావు, దక్షిణామూర్తి, శివకుమార్, అంబటి రామకృష్ణ, గోవిందు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అండగా ఉంటా : బొలిశెట్టి



తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 23 : కళాకారులకు తానెప్పుడూ అండగా ఉంటా నని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన నజరుద్దీన్ ఆహా చానల్‌లో ఇటీవల నిర్వహించిన ఇండియన్ ఐడల్ ఫేస్ త్రీ పాటల పోటీలలో విజేతగా నిలిచి పట్టణానికి రావడంతో సోమవారం స్థానిక జనసేన కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, లోటస్ స్కూల్ చైర్మన్ బొలిశెట్టి రాజేష్ ఆయనను ఘనంగా సత్కరించారు. ఘంటసాల గాన సభ అధ్యక్షుడు షేక్ కాసిం, నీలపాల దినేష్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం పట్టణంలోని మిలిటరీ కాలనీ నుంచి ఏపీ నిట్ బైపాస్, కొండాలమ్మ గుడి ప్రధాన రహదారి కి వెళ్ళేలా అప్రోచ్ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేసారు. ఇన్‌చార్జి కమిషనర్ మురళీకృష తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై తాత లైంగిక దాడి?

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 23 : మానసిక దివ్యాంగురాలైన యువతిపై వరసకు తాత అయిన వ్యక్తి లైంగిక దాడి చేయడంతో ఆ యువతి గర్భం దాల్చిన ఘటన వెలుగు చూసింది. 20వ వార్డుకు చెందిన 65 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి 18వ వార్డుకు చెందిన మానసిక దివ్యాంగురాలైన యువతిపై కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడడంతో గర్భం దాల్చింది. బంధువులు విషయాన్ని బైటకు రాకుండా సుబ్బారావుతో రాజీ చర్చలు జరిపి సుమారుగా 1.20 లక్షలకు అంగీకరం కుదుర్చుకున్నట్టు సమాచారం. అయితే గర్భ విచ్ఛిత్తికి ఒక ప్రవేటు ఆసుపత్రిలో ప్రయత్నించగా 7వ నెల వచ్చినందున కుదరదని వైద్యురాలు తిరస్కరించడంతో చేసేదేమీ లేక బంధువులు మిన్నకున్నట్టు తెలిసింది. దీనిపై ఏ విధమైన ఫిర్యాదును పోలీసులకు ఇవ్వకపోవడంతో స్థానికుల్లో చర్చ జరుగుతోంది. అయితే సదరు సుబ్బారావు సుమారు 35 ఏళ్ళ క్రితం హత్యానేరంపై సెంటర్ జైలుకు వెళ్ళడంతో పాటు, 10 ఏళ్ళక్రితం 8ఏళ్ళ బాలికను కూడా లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణన్నాయి.



కాళ్ళకూరులో ఎమ్మెల్యే రఘురామకు మద్దతుగా నినాదాలు

అంబేడ్కర్ అందరివాడు..

కాళ్ళ సెప్టెంబరు 23 : అంబేడ్కర్ అందరివాడని, ఒక కులానికి ఆపాదించడం సరికాదని కూటమి నాయకులు, దళిత నాయకులు స్పష్టం చేశారు. కాళ్ళకూరులో మాజీ సర్పంచ్ అడ్డాల శివరామరాజు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు మద్దతుగా విలేకరుల సమావేశం నిర్వహించి పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ ఏలూరుపాడులో జరిగిన సంఘటనను కొందరు వ్యక్తులు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. కులమతాల మధ్య చిచ్చు రేపుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీ అడ్డాల వెంకట శివరామరాజు, గ్రామ ఉపసర్పంచ్ నడింపల్లి ప్రదీప్, దాట్ల రామరాజు, బుంగా దానియేలు, దావులూరి ఐజాక్, వంగపండు దుర్గాప్రసాద్, వేగేశ్న సత్యనారాయణరాజు, వెంకటరమణ, సతీష్, సోమేశ్వరరావు, లక్ష్మణ్, పెద్ద ఎత్తున దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై కావాలనే ఒక వర్గంతో పాటు వైసీపీ నాయకులు అల్లరి చేస్తున్నారని గొల్లలకోడేరు టీడీపీ గ్రామ కమిటీ ఆరోపించింది. ఈ సందర్భంగా గొల్లలకోడేరు టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో ఎస్టీ జిల్లా నాయకుడు సాలా మల్లేశ్వరరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కమ్మిలి రాంబాబు, టీడీపీ బీసీ నాయకుడు కామన రాంబాబు మాట్లాడుతూ ఏలూరుపాడులో జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. రఘురామ కృష్ణరాజుకు అంబేడ్కర్ అంటే అమిత గౌరవమని, ఆయన అంబేడ్కర్‌ను ఎలా అవమానిస్తారని దీన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కొండపల్లి ఏసురత్నం, జుత్తిగ శ్రీనివాస్, టి. శ్రీనివాస్, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకివీడు: స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు దళితులు కులంతో రాజకీయం చేస్తున్నారని దళితులు మండిపడ్డారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దళిత వైద్యుడికి శిరోముండనం చేసినప్పుడు, దళిత డ్రైవర్‌ను చంపేసి డోర్ డెలివరీ చేసినప్పుడు ఈ దళితులు ఏమైపోయారన్నారు. రఘురామ నియోజకవర్గ అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నేతలు చూడలేక దళితులతో ఈ విధంగా దుష్ప్రచారం చేయిస్తున్నారన్నారు. తొమ్మిదో వార్డు ఇన్‌చార్జి జీవమ్మ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు వెలగపల్లి అప్పులు, కె. దీనరాజు, జాన్‌బాబు తదితరులు ఉన్నారు.

బ్యానర్ తొలగింపు రాజకీయం చేయడం తగదు

ఉండి: బ్యానరు తొలగింపు రాజకీయం చేయడం న్యాయమా? అంటూ మండల ఎస్‌సీ సెల్ నాయకులు, దళిత యువకులు తీవ్రంగా ఖండించారు. ఉండిలో మండల టీడీపీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు అధ్యక్షత వహించారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గొల్ల విక్టర్‌బాబు, కరిమెరక నాగరాజు, ముదునూరి కృష్ణంరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ అన్నా, దళిత సోదరులన్నా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు ప్రత్యేక అభిమానమన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుపరుస్తూ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారని మొట్టమొదటగా గళం విప్పి అంబేడ్కర్ రాజ్యాంగం కోసం పాటుపడిన వ్యక్తి రఘురామకృష్ణరాజు అన్నారు. ఏలూరుపాడులో నాగేంద్రస్వామి ఆలయానికి అడ్డుగా ఎస్సీ వర్గీకరణ వద్దు అనే బ్యానరు అక్కడ దళిత సోదరులు ఏర్పాటు చేయడమే కాకుండా ఆ గుడి అరుగుపై ధూమపానం చేయడం వల్ల గుడికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అక్కడి వారు ఎంత చెప్పినప్పటికి వారు బ్యానరును తొలగించకపోగా అట్రాసిటి కేసులు పెడతామని బెదరించడంతో అక్కడి హిందువులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారన్నారు. ఎమ్మెల్యే ఆలయాన్ని సందర్శించి అడ్డుగా ఉన్న బ్యానరును తొలగించారే తప్పా మరేమి చేయలేదంటూ వారు వివరించారు. దళిత సోదరులు దీనిని గ్రహించి రాజకీయం చేసే వారికి తగిన గుణపాఠం చెప్పాలని దళిత, మండల టీడీపీ నాయకులు కోరారు.



ఎమ్మెల్యే పితానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

వరద బాధితులకు అపుస్మా విరాళం

పెనుమంట్ర, సెప్టెంబరు 23: విజయవాడ వరద బాదితుల సహాయార్థం ఆచంట నియోజకవర్గంలోని ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అపుస్మా పాఠశాలలు) విద్యార్థులు ఉపాధ్యాయులు, మేనేజ్మెంటు సేకరించిన విరాళం రూ. 3,50,000/-లు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు చెక్కు అందజేశారు. జి. రవి కుమార్, కె. రవి కుమార్, ఎం. రమేష్ రెడ్డి, జి. కేశవ, డి. రమేష్, తేతలి సుబ్బరాయల రెడ్డి , కొమ్ముల రామకృష్ణ పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

ఆకివీడు, సెప్టెంబరు 23 : జగన్ వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేస్తే వందరోజుల్లో వాటిని పునరిద్ధరించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కోరా రామూర్తి, టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక సీహెచ్‌సీలో పారిశుధ్య కార్మికులకు సూపరింటెండెంట్, వైద్యులు అచ్యుత్ గణేష్, భువన తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

వెంకన్న అన్నదాన భవనానికి రూ.50 వేలు విరాళం

కాళ్ళ, సెప్టెంబరు 23 : కాళ్ళ మండలం కాళ్ళకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూః శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నదాన భవనానికి రూ.50,116 విరాళం అందినట్లు ఈవో అరుణ్‌కుమార్ తెలిపారు. భీమవరం వాస్తవ్యులు మేడిశెట్టి సాయిప్రణీత్ కుటుంబీకులు ఈ విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రతిమతో సత్కరించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా శ్రీనివాస్

మొగల్తూరు, సెప్టెంబరు 23: మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎన్ఎస్‌హెచ్ శ్రీనివాస్ సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన బాబ్జిరాజు కాకినాడ జిల్లాకు బదిలీ కావడంతో జడ్పీ సీఈవో సుబ్బారావు శ్రీనివాస్‌కు బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మొగల్తూరు, సెప్టెంబరు 23: ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు. మండలంలోని కేపీ పాలెం గ్రామం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు నిఘా వేసి వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేసి తహసీల్దార్‌కు సమాచారం అందించామన్నారు.

జ్యోతిష్యుడు సుబ్రహ్మణ్యానికి అవార్డు



పెనుమంట్ర, సెప్టెంబరు 23: జుత్తిగ గ్రామానికి చెందిన జ్యోతిష్య పండితుడు డాక్టర్ ఏడీవీఆర్ సుబ్రహ్మణ్యం సిద్ధాంతికి జ్యోతిష్య దైవజ్ఞ రత్న అవార్డు, బంగారు కంకణం సోమవారం తిరుమల తిరుపతిలో జరిగింది. తణుకు పట్టణంలో ఏవీఆర్ సుబ్రహ్మణ్యం జ్యోతిష్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు, శ్రీకాళహస్తి దేవస్థానము ప్రధాన అర్చకులు కంచి కామకోటి పీఠం, శృంగేరి పీఠాధిపతుల చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారని తెలిపారు.



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మాల మహానాడు నాయకులతో నల్లి రాజేష్

మాలమహానాడు నాయకుల గృహ నిర్బంధం

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 23 : మాలమహానాడు ఆధ్వర్యంలో భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడంతో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఏలూరుపాడులో ఉండి ఎమ్మెల్యే రఘురామరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీలను తొలగించారంటూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి రాజేష్ తదితరులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పట్టణ సీఐ కె రజనీకుమార్ సోమవారం ఉదయం హౌసింగ్ బోర్డులో రాజేష్ నివాసంలో గృహనిర్బంధం చేశారు. దీనికి నిరసనగా రాజేష్ పలువురు నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు.

ఆచంట: తప్పు చేసిన వారిని వదిలి తమను అరెస్టు చేయడం దళిత జాతిని అగౌరవపరచడమేనని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. పుష్పరాజ్‌ను వేమవరం తీసుకువచ్చి స్థానిక పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

నరసాపురం టౌన్: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు నివాసం ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్లేందుకు యత్నించిన ఎస్సీ నాయకుల్ని పోలీసులు సోమవారం హౌస్ అరెస్టు చేశారు. నాయకులు సోడదాసి శ్రీధర్, కాకిలేటి ఆనంద్, గాది రవి, కెనడీ, నవరత్నం, డి. శ్రీనివాస్, పి. సత్యనారాయణ, సూర్యప్రకాష్‌ను ఇళ్ల నుంచి కదలనివ్వలేదు. పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేశారు. దీన్ని ఎస్సీ నాయకులు తీవ్రంగా ఖండించారు.